సాక్షి ఖమ్మం

మంగళవారం । 7 । మార్చి । 2023



రసాభాసగా లబ్ధిదారుల ఎంపిక

మైనార్టీ సబ్సిడీ రుణాలకు భారీగా దరఖాస్తులు రావడంతో పోలీసు బందోబస్తు నడుమ ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సి వచ్చింది. 8లో



నేడు రంగుల పండుగ హోలీ

రంగుల పండుగ అయిన హోలీని మంగళవారం ఘనంగా జరుపుకునేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 18°

వాతావరణం

మంగళవారం ఉదయం కాస్త చలి ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి ఎక్కువవుతుంది.

న్యూస్‌రీల్

సమానత్వం ఇంట్లోనే మొదలు కావాలి

జిల్లా జడ్జి శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: సమాజంలో ఆడామగా ఇద్దరూ సమానమేనని, అయితే ఈ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన వెలుగుమట్లలోని కేజీబీవీలో సోమవారం నిర్వహించిన మహిళా న్యాయ చైతన్య సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశలోనే ప్రతిఒక్కరూ లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించడానికి కృషి చేయాలని సూచించారు. ఇతరుల వస్తువులు, ధనాన్ని ఆశించకుండా జీవిస్తే నీతివంతమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం జిల్లా జడ్జి వరకట్నం, భ్రూణ హత్యలు, అవినీతి నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ జావేద్ పాషా, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

డీవైఎస్‌ఓగా సునీల్‌కుమార్‌రెడ్డి



సునీల్‌కుమార్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి(డీవైఎస్ఓ)గా సుజాతనగర్ తహసీల్దార్ టి.సునీల్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. చాన్నాళ్లుగా డీవైఎస్ఓ ఎం.పరంధామ రెడ్డి బదిలీ జరగనున్నట్లు ప్రచారం జరుగుతుండగా ప్రస్తుతం కార్యరూపం దాల్చింది. రాష్ట్ర రెవెన్యూ శాఖ(సీసీఎల్ఏ) అధికారులు ఏడాది పాటు డిప్యూటేషన్‌పై సునీల్‌కుమార్‌రెడ్డిని యువజన క్రీడల శాఖకు కేటాయించగా, ఆయనను డీవైఎస్ఓగా నియమిస్తూ రాష్ట్ర యువజన క్రీడలశాఖ ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉంది. కాగా, సునీల్ సీనియర్ క్రికెటరే కాక జిల్లాలో క్రీడా పోటీల నిర్వహణకు సహకరిస్తున్నారు. అంతేకాక తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇక ప్రస్తుత డీవైఎస్ఓ పరంధామరెడ్డిని ఎక్కడకు బదిలీ చేస్తారనేది తెలియరాలేదు.

రేపు మహిళా దినోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను బుధవారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సీహెచ్.సంధ్యారాణి తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఉదయం 10:30 గంటలకు మొదలయ్యే ఈ వేడుకల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ. గౌతమ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నేడు, రేపు ఖమ్మం మార్కెట్‌కు సెలవు

ఖమ్మంవ్యవసాయం: హోలీ పండుగను పురస్కరించుకుని చాంబర్ ఆఫ్ కామర్స్ వినతి మేరకు మంగళ, బుధవారాల్లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించారు. ఈ విషయాన్ని మార్కెట్ చైర్‌పర్సన్ డి.శ్వేత తెలిపారు. కాగా, గురువారం యధాతదంగా పంటల కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు.

జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో సోమవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు 60మంది క్రీడాకారులు హాజరుకాగా, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్‌తో పాటు సీహెచ్.కృష్ణయ్య, పి.శ్రీను పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో ఆర్మూర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎ.అశోక్, సీహెచ్.శశికాంత్, పి.ఫణిహాస్, డి.ముఖేష్, జి.సంతోష్, జె.కార్తీక్, ఎం.డీ.అబ్దుల్ అహ్మద్, ఎస్.డీ.ఇర్ఫాన్, ఎస్.కే.ముషారఫ్, ఎస్.కే.ఇమ్రాన్, బి.సంజయ్, ఎస్. బన్నీ, బి.అఖిల్, జి.సాయి, టి.సంజీవ్, ఈ.రామాంజనేయులుతో కూడిన జట్టును ఎంపిక చేశారు.

కాసుల వర్షం

రిజిస్ట్రేషన్ శాఖకు ఈ సంవత్సరం రూ.204 కోట్ల రాబడి

- రూ.100 కోట్లు దాటిన ఖమ్మం కార్యాలయ ఆదాయం
- ఇంకా పెరిగే అవకాశముందని అంచనా
- రెండో స్థానంలో కొత్తగూడెం, లాస్ట్ భద్రాచలం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు అయిన రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఆర్థిక సంవత్సరంలో కాసుల పంట పండింది. రియల్ మార్కెట్ మందగించినా, ఆర్థిక సంవత్సరం తొలినాళ్లలో రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగకపోయినా.. ఆర్థిక సంవత్సరానికి ముగియడానికి ఇంకా సమయం ఉండగానే ఉమ్మడి జిల్లాలో రూ.204 కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు, స్టాంప్ డ్యూటీల ద్వారా అత్యధిక ఆదాయం రాగా.. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా కొంత ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. ఖమ్మం రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న ఖమ్మం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే అత్యధిక ఆదాయం వచ్చింది.

42వేలకు పైగా డాక్యుమెంట్లు

ఉమ్మడి జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల కోసం 42,843 డాక్యుమెంట్లు వచ్చాయి. వీటి ద్వారా రూ.204,49,27,000 ఆదాయం రాగా.. ఇందులో స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.150,40,66,000, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా రూ.23,79,03,000, రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా రూ.29,29,57,000 సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం 57,816 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా.. శాఖకు రూ.230,63,97,000 ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ ఫీజు భారీగా తగ్గింది. అయితే ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా 24 రోజులు సమయం ఉన్నందున శాఖకు మరింత ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఖమ్మంలోనే అత్యధికం..

ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచే ఈ ఆర్థిక సంవత్సరం అత్యధిక ఆదాయం సమకూరింది. ఇప్పటి వరకు ఈ కార్యాలయం ద్వారా 14,364 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేయగా.. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు ద్వారా రూ.101,42,83,000 ఆదాయం చేకూరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యాలయం నుంచి రూ.92,54,4000 ఆదాయం రాగా.. ఈసారి రూ.100 కోట్ల మార్క్‌ను దాటడం విశేషం. ఆతర్వాత స్థానాల్లో కొత్తగూడెం, ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిలవగా.. భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అత్యల్పంగా రూ.3.53 లక్షల ఆదాయమే వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ రూ.4.32 లక్షల ఆదాయం రాగా ఈసారి మరింత తగ్గడం గమనార్హం.

రియల్ ఎస్టేట్ మందగించినా..

గత కొంతకాలంగా జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. దీంతో సహజంగానే రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గుముఖం పట్టింది. భూముల క్రయవిక్రయాలు తగ్గడం, ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెద్దగా జరగకపోవడమే దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. మళ్లీ కొంతకాలంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరగడం, రెండుసార్లు మార్కెట్ వాల్యూ పెరగడం, ఫీజుల శాతం పెంపుతో ఆదాయం పెరిగిందని తెలుస్తోంది.

ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు నమోదైన ఆదాయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	ఆదాయం
ఖమ్మం	రూ.101,42,83,000
కొత్తగూడెం	రూ.28,23,46,000
ఖమ్మం రూరల్	రూ.24,16,37,000
కూసుమంచి	రూ.13,44,18,000
వైరా	రూ.11,19,08,000
మధిర	రూ.10,87,23,000
సత్తుపల్లి	రూ.8,40,99,000
కల్లూరు	రూ.4,66,01,000
బూర్గంపాడు	రూ.1,24,40,000
ఇల్లెందు	రూ.81,17,000
భద్రాచలం	రూ.3,53,000

గత ఏడాదితో పోలిస్తే ఆదాయం పెరిగింది..



గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ఈసారి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినా శాఖకు ఆశించిన మేరకు ఆదాయం సమకూరింది. మార్కెట్ వాల్యూ, ఫీజుల శాతం పెరగడంతో ఆదాయం వస్తోంది. ఖమ్మం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో గత ఏడాది రూ.100 కోట్లలోపే ఆదాయం రాగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.101 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. ఇది మరింత పెరిగే అవకాశముంది.

– ఎ.రవీంద్రబాబు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్–1, ఖమ్మం

ఆయకట్టు అంతటికీ నీరు అందాలి...

- అత్యవసర సమావేశంలో సీఈ శంకర్‌నాయక్
- రేపు నీటి పారుదల సలహా మండలి సమావేశానికి ఏర్పాట్లు



బోనకల్‌లో రెగ్యులేటర్ వద్ద పడిగాపులు కాస్తున్న సర్పంచ్‌లు, రైతులు

ఖమ్మంఅర్బన్: జిల్లాకు చేరుతున్న సాగర్ జలాలను మొత్తం ఆయకట్టుకు అందించి పంటలను రక్షించడాన్ని ఉద్యోగులు బాధ్యతగా భావించాలని జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ ఇంజనీర్లను ఆదేశించారు. ఖమ్మంలోని కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన ఇంజనీర్లతో అత్యవసరంగా సమావేశమై చర్చించారు. ప్రాజెక్టు నుండి జిల్లాకు 7 వేల క్యూసెక్కుల నీరు రావాల్సి ఉన్నా, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రోజుకు 5 వేల క్యూసెక్కులకు తగ్గకుండా ఇస్తామని చెప్పారన్నారు. అది కూడా పూర్తి స్థాయిలో రావడం లేదని తెలిపారు. ఈక్రమంలో పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న నీటినైనా చివరి భూములకు అందించేలా ఇంజనీర్లు పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడా లీకేజీలు లేకుండా, నీరు వృథా కాకుండా చూస్తూ వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాకు నిర్ణయించిన మేరకు నీరు రాకపోవడంతో బోనకల్లు, మధిర బ్రాంచి కాల్వల పరిధిలో తీవ్ర సమస్య ఉండగా.. ఏపీకి ఇవ్వాల్సిన నీరు ఇవ్వలేక అక్కడి నుండి ఒత్తిడి వస్తోందని చెప్పారు. కాగా, సాగర్ నుంచి జిల్లాలో 136 కి.మీ. వరకు ఉన్న కాల్వలో వస్తున్న నీరు, వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ఈనెల 9నుండి జిల్లాకొక ఈఈ, డీఈతో పర్యవేక్షించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఈనెల 8న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్ సమక్షాన జరగనున్న జిల్లా నీటి పారులదల సలహా మండలి సమావేశానికి అధికారులు అన్ని వివరాలతో సిద్ధం కావాలని సీఈ సూచించారు. ఎస్‌ఈలు ఆనంద్‌కుమార్, నర్సింగరావు, ఈఈలు ఎం.వెంకటేశ్వర్లు, అనన్య, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, డీసీఈ ధనుకుమార్‌రెడ్డి, డీఎస్‌ఈలు వెంకట్రాం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల పడిగాపులు

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు కొన్నాళ్లుగా నిరసన తెలుపుతున్నారు. ఇటీవల పాలేరు రిజర్వాయర్ నీటి విడుదల నిలిపేసి మళ్లీ విడుదల చేసినా సోమవారం వరకు బీబీసీలోకి నీరు చేరలేదు. దీంతో మొక్కజొన్న పంట ఎండిపోతుందని చెబుతూ రావినూతల, ఆళ్లపాడు సర్పంచ్‌లు కొమ్మినేని ఉపేందర్, మర్రి తిరుపతిరావుతో పాటు రైతులు పడిగాపులు కాస్తూ కనిపించారు. ఇకనైనా చివరి భూములకు నీరందించేందుకు వారబంధీ విధానాన్ని ఎత్తేయాలని డిమాండ్ చేశారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



రాజులదేవరపాడు పాఠశాలలో తరగతి గదులను ప్రారంభించిన సీఎల్పీ నేత భట్టి

మధిర/ఎర్రుపాలెం: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని మధిర ఎమ్మెల్యే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర మండలంలోని పలు గ్రామాలతో పాటు ఎర్రుపాలెం మండలంలోని మామునూరు, రాజులదేవరపాడు, అయ్యవారిగూడెం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. మామునూరులో హెల్త్ సబ్‌సెంటర్, పాఠశాల అదనపు గదులు, రాజులదేవరపాడులో స్కూల్ కాంప్లెక్స్ గదులు, సీసీ రోడ్డును ప్రారంభించాక, అయ్యవారిగూడెంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేస్తూ పలువురిని పలకరించారు. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈకార్యక్రమాల్లో జెడ్పీటీసీ శీలం కవిత, సర్పంచ్‌లు సర్పంచ్ నిడమానూరు సంధ్య, మారాబత్తుల మోహన్‌రావు, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ తల్లపురెడ్డి ప్రవల్లిక, నాయకులు శీలం ప్రతాపరెడ్డి, బండారు నర్సింహారావు, తల్లపురెడ్డి నాగిరెడ్డి, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవరకొండ శ్రీనివాసరావు, అనుమోలు కృష్ణారావు, దేవరకొండ రాజీవ్‌గాంధీ, వంశీ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలిలో శ్రీ వేణుగోపాల స్వామి వారిని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క – నందిని దంపతులు సోమవారం దర్శించుకోగా ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాద్, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కౌన్సిలర్ కోనా ధనికుమార్, నాయకులు సూరంశెట్టి కిషోర్, కోనా సుచరిత, రంగా అప్పారావు, దారా బాలరాజు, దుంపా వెంకటేశ్వర రెడ్డి, కర్నాటి రామారావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించండి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



తనికెళ్ల రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

'గ్రీవెన్స్ డే'లో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో ఆయన ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించాక పలు సూచనలు చేశారు.

'కంటివెలుగు'ను తనిఖీ చేయండి

గ్రీవెన్స్ అనంతరం కలెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అధికారులుగా ఉన్న వారు మండలాలకు వెళ్లినప్పుడు కంటి వెలుగు శిబిరాల తనిఖీ చేయాలని సూచించారు. అలాగే, మన ఊరు–మన బడి, దళితబంధు పథకంపై సూచనలు చేశారు.

రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దు

రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో సమీక్షించిన ఆయన ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని, జీఓ 58, 59పై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఏఓ కె.శ్రీనివాసరావు, ఆర్డీఓ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీ

కొణిజర్ల/రఘునాథపాలెం: కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లో తనికెళ్ల, వీ.వీ.పాలెంలోని రేషన్ దుకాణాలను కలెక్టర్ గౌతమ్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం స్టాక్, పంపిణీ, నిల్వపై ఆరా తీసిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. బియ్యం సక్రమంగా ఇస్తున్నారా, ఎక్కడైనా డబ్బులు ఇస్తున్నారా అని ఆరా తీశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ డీఎం సోములు, డీటీలు ఎర్రయ్య, విజయ్‌బాబు, ఆర్‌ఐలు సునీత, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్ష

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించారు. జిల్లాలో జనరల్ విభాగం నుంచి 15,520మంది విద్యార్థులకు 15,222 మంది, ఒకేషనల్ విభాగంలో 2,476మందికి 2,249మంది హాజరయ్యారని డీఐఈఓ కె.రవి బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

మిర్చి ధర పతనం

- మూణ్నాళ్ల ముచ్చటగానే అత్యధిక రేటు
- మొన్న క్వింటాకు రూ.21,625, నేడు రూ.20,500



ఖమ్మం మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: దేశంలోనే ఖమ్మంలో మిర్చికి అత్యధిక ధర లభిస్తుందన్న రైతుల సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఫిబ్రవరి చివరలో క్వింటాకు రూ.21,625గా పలికిన తేజా రకం మిర్చి ధర సోమవారం రూ.20,500కు పడిపోయింది. వారం వ్యవధిలోనే ఏకంగా రూ.1,125 మేర ధర తగ్గడం గమనార్హం. జాతీయ మార్కెట్‌లో ధర తగ్గడం, విదేశీ ఎగుమతుల ధర నిలకడగా కొనసాగుతుండడంతో మిర్చి ధర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీనికి తోడు ఉత్తరాది రాష్ట్రాల్లో హోలీ పండుగ ప్రభావం కూడా పడిందని సమాచారం.

గత నెల మొదట్లో తగ్గి.. మళ్లీ పైపైకి

జనవరిలో క్వింటా మిర్చికి రూ.19వేల నుంచి రూ.20 వేల మధ్య పలికిన ధర ఫిబ్రవరి ఆరంభంలో రూ.18 వేలకు పడిపోయింది. ఇక మూడో వారం నుంచి పుంజుకుంటూ 14న రూ.18,400, 22న రూ.19,100 చేరడమే కాక ఈనెల 1, 2వ తేదీల్లో రూ.21,600 పలికింది. ఆతర్వాత తగ్గుతూ సోమవారం రూ.20,500కు పడిపోవడం గమనార్హం. కాగా, సోమవారం మార్కెట్‌కు 35,208 బస్తాల మిర్చి విక్రయానికి రాగా మోడల్ ధర రూ.19,500గా నమోదైంది. సాధారణంగా పంట విక్రయాలు తగ్గితే డిమాండ్ పెరగాల్సి ఉన్నా అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇది కదా రాజసం !

- బండలాగుడు పోటీల్లో 'పందెం' ఎద్దుల పోటాపోటీ
- జత ఎడ్ల ఖరీదు రూ.40లక్షలకు పైగానే
- సంరక్షణ, ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు
- కందుకూరులో ఏళ్లుగా పోటీలు





ఎండ తగలకుండా ఏర్పాటుచేసిన పరదాల కింద ఎద్దులు (ఇన్‌సెట్) పోటీల్లో పరుగులు తీస్తూ

సత్తుపల్లి: వ్యవసాయం అంటే రైతుకు ప్రీతి. వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దు అంటే మహాప్రీతి! ఈ విషయాన్ని పక్కన పెడితే ఇక ఎడ్ల బండలాగుడు పందాలపై ఆసక్తి కలిగిన వారెందరో కనిపిస్తారు. ఇందుకోసమే ప్రత్యేకంగా ఎడ్లను కొనుగోలు చేసి కన్నబిడ్డల్లా సాకుతూ వాటిని ప్రత్యేక ఆహారంతో పోటీలకు తీర్చిదిద్ది ఎక్కడ పందేలు జరిగినా బరిలోకి దింపుతుంటారు. ఈక్రమంలోనే వేంసూరు మండలం కందుకూరులో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవాలను పురస్కరించుకుని ఏటా ఎడ్ల బండలాగుడు పందేలు నిర్వహిస్తుండగా ఈసారి రెండు రాష్ట్రాల నుంచి 20 జతలకుపైగా ఎడ్లు వచ్చాయి. ముఖ్యంగా ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి పోటీలకు ఎక్కువ మంది రైతులు రాగా.. ఒక జత ఎడ్ల ఖరీదు రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటాయని చెబుతుండడంతో అంతా ఆసక్తిగా పరిశీలిస్తున్నారు.

మూడేళ్ల నుంచి రెడీ

ఎద్దు జీవితకాలంలో మూడేళ్ల నుంచి పదేళ్ల వరకు పందేలకు తీసుకెళ్లారు. అలా ఏటా కనీసం 30 పందేలకు తీసుకెళ్తామని యజమానులు చెబుతున్నారు. కందుకూరు రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి స్వగ్రామం కావడంతో ఆయన, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఆలయ చైర్మన్ రాయల సత్యనారాయణ సహకారంతో మూడు రోజులు పాటు పండుగ వాతావరణంలో జరిగే పోటీలు మంగళవారం ముగియనున్నాయి.

ఊడిన పళ్లతోనే పోటీలకు అర్హత

ఎద్దు పుట్టినప్పుడు ఎనిమిది పళ్లు ఉంటాయి. మనిషి తరహాలోనే ఈ పళ్లు ఊడిపోయి మళ్లీ వస్తుంటాయి. అయితే పళ్లు ఊడిన దగ్గరి నుంచే ఏ విభాగంలో పోటీకి అవి పనికొస్తాయో నిర్ణయిస్తారు. మూడేళ్ల వచ్చిన తర్వాత ఎదర జతపళ్లు ఊడిపోతాయి. ఆ సమయంలో ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల బరువు బండలాగుడు పోటీలకు సిద్ధం చేస్తారు. మూడున్నరేళ్ల తర్వాత నాలుగుపళ్లు ఊడగా ఎనిమిది క్వింటాళ్ల వరకు బండలాగుడు పోటీలకు పంపుతారు. నాలుగేళ్ల తర్వాత ఆరు పళ్లు ఊడడంతో 12 క్వింటాళ్ల బండలాగుడు పోటీలకు ఎంపిక చేస్తారు. ఇక ఎనిమిది పళ్లు ఊడాక సబ్‌జూనియర్ కింద 14 నుంచి 15 క్వింటాళ్ల బరువు.. ఆతర్వాత 18 నుంచి 20 క్వింటాళ్లు, సీనియర్ విభాగంలో 24 నుంచి 25 క్వింటాళ్ల వరకు బండలాగుడు పోటీలకు ఎద్దులను వినియోగిస్తారు.

ఉదయం ఉలవలు.. మధ్యాహ్నం రాగిజావ

ఎడ్లను పోటీకు సిద్ధం చేసే రైతులు ప్రయాసాలకోర్చడమే కాక ప్రేమగా బాధ్యతను నిర్వర్తిస్తారు. వీటికి ఎండ తగలకుండా, దోమలు కుట్టకుండా పరదాలు ఏర్పాటు చేస్తారు. ఉదయాన్నే మూడు కేజీల ఉలవలు, మధ్యాహ్నం రాగిజావ, సాయంత్రం క్యారెట్, బీట్‌రూట్, డ్రై ఫ్రూట్స్, రాత్రికి మూడు కిలోల ఉలవలు తినిపిస్తారు. అలాగే, రోజూ ఉదయాన్నే ఎడ్లకు స్నానం చేయించి వేడి నీళ్లతో తుడుస్తారు. పందేలకు వెళ్లినప్పుడు ఎద్దులు ఒళ్లు నొప్పులతో బాధపడకుండా మందులు వేస్తారు. ఒక్కో ఎద్దుకు రోజుకు కనీసం రూ.వెయ్యి వెచ్చించడమే కాక సంరక్షణకు ఇద్దరిని నియమిస్తారు.

ఎక్కడ పందేలు జరిగినా వెళ్తాం..



తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఎడ్ల బండలాగుడు పోటీలు జరిగినా వెళ్తాం. ఇప్పటికి 30 పందేల వరకు గెలుచుకున్నాం. ఎద్దులంటే మాకు ప్రేమ. ఒక్కో ఎద్దు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పలుకుతుంది. జీవితకాలంలో కనీసం పది నుంచి 12 ఏళ్ల వరకు పోటీలకు తీసుకెళ్తాం.

– కె.చిట్టిబాబు, వేటపాలెం, బాపట్ల జిల్లా, ఏపీ

పోటీలు నిర్వహించడం అదృష్టం..



ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించటం అదృష్టంగా భావిస్తున్నా. మా గ్రామ వాసి, ఎంపీ బండి పార్థసారధిరెడ్డితో పాటు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నాం. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం.

– మందపాటి వెంకటరెడ్డి, పందేల నిర్వాహకులు, కందుకూరు

క్లుప్తంగా

దుమ్ము రేగకుండా చర్యలు

సింగరేణి ఏరియా జీఎం జక్కం రమేష్



కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వద్ద పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

సత్తుపల్లి/సత్తుపల్లి రూరల్: సత్తుపల్లి మండలం కిష్టారం లోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుంచి నల్లటి దుమ్ము వెలువడకుండా వారంలోగా చర్యలు తీసుకుంటామని సింగరేణి జీఎం జక్కం రమేష్ తెలిపారు. 'సాక్షి'లో సోమవారం 'నల్ల దుమ్ముతో నరకం!' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సింగరేణి పీఓలు వెంకటాచారి, నర్సింహారావుతో కలిసి సోమవారం కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను పరిశీలించి దుమ్ము రేగడానికి కారణాలపై విశ్లేషించారు. ఇక నుంచి నీటి సరఫరా నిరంతరం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆతర్వాత కిష్టారం ఓపెన్‌కాస్టులో నిర్మించిన పీఓ కార్యాలయాన్ని జీఎం రమేష్ ప్రారంభించారు. అలాగే, మోటారు సైకిల్ షెడ్‌ను ఏజీఎం శామ్యూల్ సుధాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఏజీఎం పి.సూర్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రఘురామిరెడ్డి, అధికారులు లక్ష్మణమూర్తి, మదీనాపాషా, రమణారెడ్డి, రఘురాంరెడ్డితో పాటు ఎం.డీ.రజాక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.52.30లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం కైకొండాయి గూడెంనకు చెందిన సెలూన్ షాపు యజమాని జూపాటి వెంకటేష్ రూ.52.30 లక్షలకు గాను దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. నగరంలోని యూపీహెచ్ కాలనీలో సెలూన్ షాప్ ఏర్పాటు చేసిన ఆయన పలువురి వద్ద అప్పు తీసుకున్నాడు. ఆతర్వాత అప్పు తీర్చలేని పరిస్థితి రావడంతో 13మందిని ప్రతివాదులుగా చేరుస్తూ సోమవారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

ఆరేళ్ల చిన్నారిపై లైంగికదాడి

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని చిమ్మపుడిలో ఆరేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. సదరు చిన్నారి ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయాన సమీపంలో నివసించే ఆటోడ్రైవర్ కె.కార్తీక్ మాయమాటలు చెప్పి ఆటోలో గ్రామశివార్లకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చాక బాలిక తల్లిదండ్రులకు చెప్పగా రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి గ్రామంలో విచారణ చేపట్టి చిన్నారిని వైద్యపరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయగా, ఆదివారం పరారైన కార్తీక్‌ను సోమవారం రఘునాథపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేటలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మహారాష్ట్రకు చెందిన వలస కూలీ అతుల్‌ఠాకూర్(30) మిర్చికోతల కోసం జనవరి 26న భగవాన్‌నాయక్ తండాకు వచ్చాడు. ఫిబ్రవరి 28న కుటుంబ సభ్యులతో గొడవపడి వెళ్లిపోయిన ఆయన సోమవారం తూతకలింగన్నపేట చెరువులో మృతదేహమై కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారి మృతదేహాన్ని వెలికితీసి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఠాకూర్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

కేజీబీవీలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తి

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం కేజీబీవీ హాస్టల్‌లోకి ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. రాత్రి 11గంటల సమయాన విద్యార్థినులు నిద్రిస్తుండగా సదరు వ్యక్తి తలుపులు గట్టిగా కొట్టడంతో విద్యార్థినులు, వార్డెన్లు ఆందోళనకు గురయ్యారు. దీంతో వారు కేకలు వేయగా ఆయన పారిపోయాడు. ఈమేరకు సోమవారం ఉదయం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఇందిర ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెరుకు తోట దగ్ధం

కూసుమంచి: మండలంలోని పాలేరులోని చెరుకుతోట సోమవారం రాత్రి దగ్ధమైంది. జుజుల్‌రావుపేటకు చెందిన రైతు శ్రీరాముల ఉప్పలయ్య ఆరు ఎకరాల్లో చెరుకు సాగు చేయగా, సోమవారం కోత మొదలుపెట్టాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు అంటుకున్న మంటలు చెలరేగగా అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోగానే సగం మేర పంట కాలి బూడిదైందని రైతు వాపోయాడు.

110 పశువులు పట్టివేత

కల్లూరు: కల్లూరు మీదుగా అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నుంచి రెండు వాహనాల్లో 110 పశువులను తరలిస్తుండగా సోమవారం చేపట్టిన తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. ఈమేరకు వాహనదారుల వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలతో పాటు పశువులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రఘు తెలిపారు.

యూనిట్లు 40.. దరఖాస్తులు 3,500



అధికారులతో వాగ్వాదానికి దిగిన దరఖాస్తుదారులు

- రసాభాసగా లబ్ధిదారుల ఎంపిక..
- కేఎంసీ కమిషనర్, పోలీసుల జోక్యంతో లాటరీ
- ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన ఎంపిక ప్రక్రియ

ఖమ్మంమయూరిసెంటర్: ఏళ్ల తర్వాత ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సబ్సిడీ రుణాల మంజూరు ప్రక్రియ చేపట్టింది. దీంతో జిల్లావ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తు చేసుకోగా.. అధికారులు సోమవారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో లబ్ధిదారుల ఎంపికను ఎన్ఎస్పీ క్యాంపులోని గిరిజన భవనంలో నిర్వహించారు. అయితే, యూనిట్లు 40 మాత్రమే ఉండగా.. దరఖాస్తుదారులు వేలల్లో ఉండడంతో రసాభాసగా మారింది. ఉదయం 11 గంటలకే దరఖాస్తులు, వారి బంధువులు పెద్దసంఖ్యలో చేరగా, కరెంట్, సరిపడా కుర్చీలు లేక గందరగోళం నెలకొంది. డ్రా తీయకుండా దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు ఇవ్వాలనే డిమాండ్‌తో నినదించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.

వాయిదా వేసిన అధికారులు..

లబ్ధిదారుల ఆందోళన విషయాన్ని కేఎంసీ మేనేజర్ విజయానంద్ ఉన్నతాధికారులకు వివరించారు. పోలీసులు కూడా ఎంపికను వాయిదా వేసుకోవాలని సూచించినట్లు చెప్పడంతో కమిషనర్ సాయంత్రం 4 గంటలకు వాయిదా వేశారు. దీంతో లబ్ధిదారులంతా వెనుదిరిగారు. ఇక సాయంత్రం పోలీసు బందోబస్తు మధ్య సాయంత్రం తిరిగి ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఈక్రమంలో గిరిజన భవనానికి వచ్చే రోడ్డులో బారికేడ్లు ఏర్పాటుచేసిన పోలీసులు దరఖాస్తుల పత్రాలను పరిశీలిస్తూ వారినే అనుమతించారు. అలాగే, కుర్చీలు, తాగు నీరు ఏర్పాటుచేశారు.

40 మంది ఎంపిక..

కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు హాజరై పర్యవేక్షించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 40 యూనిట్లకు గాను 3,500 దరఖాస్తులు వచ్చాయి. రూ.లక్ష యూనిట్లు 28, రూ.2లక్షల యూనిట్లు 12 ఉండగా, సాయంత్రం 4నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఎంపిక ప్రక్రియ కొనసాగింది. ఈమేరకు పిల్లలతో డ్రా తీయిస్తూ కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పేర్లు వెల్లడించారు. మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ.మెహమూది, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు, కేఎంసీ మేనేజర్ విజయానంద్, ఎల్‌డీఎం తదితరులు పాల్గొన్నారు.



లాటరీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

తరలిరాద తనే వసంతం..

నేడు రంగుల పండుగ హోలీ

ఖమ్మం గాంధీచౌక్: వసంత రుతువును ఆహ్వానిస్తూ వచ్చే పండుగ హోలీ. జిల్లావ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుక జరుపుకుంటారు. అయితే, ప్రభుత్వం మంగళవారం సెలవు ప్రకటించగా.. కొందరు మంగళవారం, ఇంకొందరు బుధవారం జరుపుకునేందుకు సమాయత్తమవుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని ప్రాంతాల్లో మంగళవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకోనున్నారు. కాగా, రసాయనాలతో తయారయ్యే రంగులు పూసుకోవడం ఆరోగ్యానికి, ప్రకృతికి హానికరమని వైద్య, పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

పూర్వం మోదుగు పూలు..

పూర్వం పల్లెల్లో మోదుగు పూలతో తయారు చేసిన రంగులను పూసుకునేవారు. పండుగకు వారం రోజుల ముందే తెచ్చుకుని, మట్టిపాత్రలో నానబెట్టేవారు. ఒకరోజు ముందు పూల నుంచి ఊరిన ఊట రసాన్ని పసుపు, కుంకుమలతో మిళితం చేసి బాటిల్‌లో నింపి సిద్ధం చేసుకునేవారు. హోలీ రోజు పరస్పరం మీద చల్లుకుని ఆనందించేవారు. ఈ రంగుతో ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎటువంటి ప్రమాదం ఉండేది కాదు. కాగా కాలక్రమంలో మోదుగు పూల రంగుల వాడకం పూర్తిగా తగ్గిపోయింది.

వైష్ణవాలయాల్లో స్వామి కల్యాణం

హోలీ సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో స్వామి కల్యాణం జరిపేందుకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. భిన్న మతస్తులు వారి సంప్రదాయాల రీతిలో జరుపుకునే పండుగ హోలీ. హిరణ్యకశిపుడి చెల్లెలైన హోలిక.. ప్రహ్లాదుడిని మంటల్లో వేసినప్పుడు ఆయన దైవలీలతో తప్పించుకుంటాడు. ఆతర్వాత భోగి మంటలు వేయగా హోలిక అందులో దహనమైందని పురాణ కథనం. అందుకే హోలీకా దహనం ఇక్కడ కామ దహనంగా జరుపుకుంటారు. కాగా, కామ దహనంతో హోలీ వేడుకలు ప్రారంభమవుతాయి. ఖమ్మం నగరంతో పాటు పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుంచి కామ దహనం నిర్వహించారు. కూడళ్లలో కర్రలను కుప్పలుగా వేసి ప్రతిమలను దహనం చేయగా.. మంగళవారం ఉదయం చిన్నాపెద్ద తేడా లేకుండా పరస్పరం రంగులు చల్లుకుంటూ సంబరంగా హోలీ జరుపుకుంటారు. ఇక కూసుమంచి తదితర ప్రాంతాల్లో గిరిజనులు మూడు రోజుల పాటు హోలీ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



కోయచెలక వద్ద విరగబూసిన మోదుగు పూలు

సీఐ అంజలికి 'సేవానందిని' అవార్డు

ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్‌సీఐ అంజలికి సేవానందిని అవార్డు లభించింది. తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ప్రకటించిన ఈ అవార్డును ఆమె సోమవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్ కృష్ణమోహన్, ప్రముఖ సినీ నటీమణులు మంజుభార్గవి, రోజారమణి తదితరులు ఆమెకు అవార్డు అందజేసి సన్మానించారు.



అవార్డు అందుకుంటున్న సీఐ అంజలి

బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో పొంచి ఉన్న ప్రమాదం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మోటాపురంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

నేలకొండపల్లి/ఖమ్మం మయూరిసెంటర్: దేశ సంపదను కార్పొరేట్లకు కేంద్రప్రభుత్వం దోచి పెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. మండలంలోని మోటాపురంలో సోమవారం ఏర్పాటుచేసిన సీపీఎం నాయకుడు చావా అప్పారావు సంస్మరణసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుండగా.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో దేశానికి ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ కొత్త రాజ్యాంగాన్ని తీసుకొచ్చే యత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సభలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఎం, సీపీఐ రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, బాగం హేమంతరావుతో పాటు వివిధ పార్టీల నాయకులు నున్నా నాగేశ్వరరావు, నున్నా రవికుమార్, చావా కిరణ్, పోటు ప్రసాద్, శివయ్య, గుడిమళ్ల మధు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, బెల్లం లక్ష్మి పాల్గొన్నారు. కాగా, అటవీశాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి పరిష్కారానికి కృషి చేయాలని ఫారెస్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బాధ్యులు తమ్మినేని వీరభద్రంకు ఖమ్మంలో వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు నున్నా నాగేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బానోత్ శ్రీను, బచ్చు సైదుబాబు, పుల్లారావు, భాను పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఇంటర్ కమ్ కనెక్షన్లు



కలెక్టరేట్ ఏఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్

ఖమ్మం సహకారనగర్: కొత్త కలెక్టరేట్ (ఐడీఓసీ)లో 37 శాఖల కార్యాలయాలు ఏర్పాటుచేయగా, శాఖల అధికారులు, సెక్షన్ల సూపరింటెండెంట్లకు ఇంటర్ కమ్ కనెక్షన్లు సమకూర్చారు. వీరు ఉన్నతాధికారులకు అందుబాటులో ఉండేలా ఈ కనెక్షన్లు ఉపయోగపడనున్నాయి. ఇప్పటికే కొన్ని శాఖల్లో ఫోన్లు ఉపయోగంలోకి రాగా.. మిగతా శాఖల్లో ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇక కలెక్టరేట్‌లో అప్పుడప్పుడు నీటి సమస్య ఎదురవుతుండడం, వేసవి వచ్చిన నేపథ్యాన అధికారులు ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఏఓ కె.శ్రీనివాసరావు, మిషన్ భగీరథ అధికారులు పరిశీలించారు. కాగా, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో హౌస్ కీపింగ్ సిబ్బందికి చంద్ర ఫౌండేషన్ నిర్వాహకులు రజిత, ఏఓ శ్రీనివాసరావు జూట్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో చంద్ర ఫౌండేషన్ నిర్వాహకులు రజిత తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డ జాడ చూపండి సారూ...

కాల్వలో గల్లంతైన యువతి కోసం కుటుంబీకుల ఆవేదన



కాల్వ కట్టపై ఎదురుచూస్తున్న రూప బంధువులు

నేలకొండపల్లి: చెరుకు నరికేందుకు వలస వచ్చిన కూలీ ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో గల్లంతై రెండు రోజులవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం గంగారానికి చెందిన రూప(17) పలువురితో కలిసి నేలకొండపల్లి మండలంలో చెరుకు నరికేందుకు వచ్చారు. ఈక్రమంలో ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు సాగర్ కెనాల్‌లో పడి గల్లంతైన రూప కోసం కుటుంబ సభ్యులు, తోటి కూలీలు గాలించినా ఆచూకీ లభించలేదు. మళ్లీ సోమవారం ఉదయం నుంచి వెతికినా ఫలితం కానరాలేదు. అటు అధికారులు, ఇటు ఫ్యాక్టరీ యజమాన్యం స్పందించడం లేదని ఆరోపిస్తూ వారు రాజేశ్వరపురం బ్రిడ్జి వద్ద నిరసన తెలిపారు. సాగర్ కెనాల్‌లో నీటి ప్రవాహం తగ్గిస్తే తామే గాలిస్తామని చెప్పినా వినిపించుకోవడం లేదని రూప తల్లి నాగేంద్రమ్మ తదితరులు విలపించారు. కాగా, ఫ్యాక్టరీ ఎదుట రూప కుటుంబీకులు, కూలీలు సోమవారం రాత్రి ఫ్యాక్టరీ ఎదుట మళ్లీ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్ తదితరులు సంఘీభావం తెలిపారు.

12న 'సత్తుపల్లి' సమ్మేళనం

నారాయణపురంలో అనుచరులతో పొంగులేటి భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కల్లూరు రూరల్: భవిష్యత్‌లో తాను తీసుకునే నిర్ణయం రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసేలా ఉంటుందని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కల్లూరు మండలంలోని తన స్వగ్రామమైన నారాయణపురంలో సోమవారం ఆయన ముఖ్య అనుచరులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ తాను ఏ పార్టీలో చేరతానోనని అందరూ ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అయితే, ముఖ్య అనుచరులు, అభిమానులు, ప్రజాభీష్టం మేరకే నిర్ణయం ఉంటుందని తెలిపారు. మెజార్టీ ప్రజలు ఒక పార్టీని సూచించారని చెప్పారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉన్నందున, పది నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తయ్యాక తన నిర్ణయం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ఈనెల 12న సత్తుపల్లిలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. ఈసమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం హామీకి కట్టుబడి ఉండాలి

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రప్రభుత్వం పోడు సాగుదారులకు 11 లక్షల ఎకరాలకు సంబంధించి పట్టాలు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులందరికీ పట్టాలతో పాటుగా, గిరిజనేతర పేదలకు పొజిషన్ పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ అంశాన్ని ఎన్నికల వరకు సాగదీయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇక డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో విఫలమైనందున సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర ప్రభుత్వ అండను చూసుకుని దేశాన్ని ఫాసిజం వైపు తీసుకెళ్తున్నాయని విమర్శించారు. ఇక 50 ఆకుల తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని, ఈనెల 10న హైదరాబాద్‌లో జరగనున్న రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో కూరగాయల వ్యాపారి మృతి



మృతి చెందిన హరిలాల్

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు వద్ద ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టిన ఘటనలో కూరగాయలతో వెళ్తున్న వ్యాపారి జర్పుల హరిలాల్(34) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం కామేపల్లి మండలం జోగ్గూడెంకు చెందిన హరిలాల్ గ్రామంలో కూరగాయల దుకాణం నిర్వహిస్తుండగా రోజులాగే సోమవారం ఖమ్మం మార్కెట్‌లో కూరగాయలు తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈమేరకు బూడిదంపాడు శ్మశానవాటిక సమీపాన ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రోడ్డులో నెమలిపురి నుంచి ఖమ్మం మార్కెట్‌కు మిర్చి తీసుకెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో హరిలాల్ అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కూరగాయలతో వస్తాడనుకుంటే...

గ్రామంలో ప్రతీరోజు కూరగాయల అమ్మకంతో జీవనం సాగించే హరిలాల్ మార్కెట్ నుంచి వచ్చే సమయం కావడంతో సోమవారం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. అయితే, కూరగాయలతో రావాల్సిన ఆయన మార్గమధ్యలో మృతి చెందినట్లు సమాచారం తెలియగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు..

ముదిగొండ: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతి చెందాడు. మండలంలోని బాణాపురానికి గ్రామానికి చెందిన యంగ్రాతి ధనలక్ష్మికి తన భూమిలో వరి సాగు చేస్తున్నారు. సోమవారం ఆమె కుమారుడు కొండల్‌రావు(32) పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లి కాలుజారి బావిలో పడ్డాడు. అయితే, ఈత రాకపోవడంతో నీళ్లలో మునిగి మృతి చెందగా, ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా, సాంస్కృతిక పోటీలు



నృత్యం చేస్తున్న మహిళా ఉద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్: టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యాన మహిళా ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలు సోమవారం రెండో రోజుకు చేరాయి. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో డ్యాన్స్, పాటలు, ఫ్యాన్సీ డ్రెస్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించగా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్.సాగర్‌తో పాటు శాబాసు జ్యోతి, స్వప్న, నందగిరి శ్రీను, బుద్దా రామకృష్ణ, ఆర్.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.